క్లుప్తంగా

కన్నుల పండువగా స్వామివార్ల ఊరేగింపు



భీమడోలులో ఓ ట్రాక్టర్‌పై ఊరేగుతున్న వేంకటేశ్వర స్వామి, భీమేశ్వర స్వామి వార్లు

భీమడోలు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో వేంకటేశ్వర స్వామి, శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయం, వేంకటేశ్వర స్వామి వార్ల ఉభయ దేవేరుల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. సుందరంగా ముస్తాబైన వాహనంపై మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ పూజారులు విశేష పూజలు చేసారు. స్వామి వార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేసారు. గుండుగొలనులో వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని అశ్వవాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు వగ్వాల అచ్యుత రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఐక్యతతోనే అభివృద్ధి



నటీనటులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పీ రవీంద్రబాబు

దెందులూరు: విద్యతోనే అభివృద్ధి, ఐక్యత అవగాహన కలుగుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ డాక్టర్ పీ. రవీంద్రబాబు అన్నారు. కొవ్వలి కమ్యూనిటీ హాలులో అంబేడ్కర్ పై శరణం గచ్ఛామి నాటకాన్ని హైదరాబాద్ అభ్యుదయ అకాడమి సభ్యులు ప్రదర్శించారు. పాత్రధారులను ఎమ్మెల్సీ రవీంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులంతా ఐక్యంగా ఉంటూ ప్రతి ఒక్కరూ విద్య అభ్యసించాలన్నారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ ఫలాలు ఫలితమే నేడు దేశంలో పేద, బడుగు, బలహీన, గిరిజన, దళిత, మైనార్టీ వర్గాల హక్కుల పరిరక్షణ అభివృద్ధి భద్రత భవిష్యత్ లభించిందన్నారు. దెందులూరు మండలం వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, జాన్‌ఎప్రాయిమ్ రాజు, కే.వెంకటేశ్వర రావు, కాటి అర్జున్, గొట్టికల నాగభూషణం ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులు కొవ్వలి దళిత పెద్దలు పాల్గొన్నారు.

మూతపడిన ఏటీఎం కేంద్రాలు

భీమడోలు: ఏనీ టైం మనీ కేంద్రాల్లో నగదు లేక వెలవెలబోయాయి. దీనితో జనం ఏటీఎం మిషన్లలో నగదు లేక నిట్టూర్పులు విడుస్తూ తిరిగి వెళ్తున్నారు. గ్రామాల్లో చాలా ఏటీఎం కేంద్రాలను మూసి వేయగా మరి కొన్ని చోట్ల నగదు లేక నిరుపయోగకరంగా మారాయి. సంక్రాంతిని పురస్కరించుకుని బ్యాంకులకు ఐదు రోజుల పాటు సెలవులు ఇచ్చారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కురెళ్లగూడెం, పోలసానిపల్లి తదితర గ్రామాల్లో అన్ని బ్యాంకులకు చెందిన ఏటీఎం ఉన్నాయి. అయితే బ్యాంకు యాజమాన్యం శుక్రవారం ఏటీఎం మిషన్లలో ఉంచిన క్యాష్ శని, ఆదివారంల్లో నిండుకుంది. ఆ తర్వాత సోమవారం నుంచి మిషన్లలో నగదు లేకపోవడంతో జనం నగదు కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ ఖాతాల్లో డబ్బులు ఉన్నా అవసరానికి వినియోగించుకునేందుకు అవకాశం లేక అవస్థలు ఎదుర్కొన్నారు. గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే ఉన్నప్పటికీ కోడి పందేలు, జూద క్రీడల వద్ద నగదుకు ప్రాధాన్యత ఇవ్వడంతో వారంతా అప్పులు చేయాల్సి వచ్చింది. వరసగా ఐదు రోజుల పాటు సెలవులు ఇచ్చిన తర్వాత ఏటీఎంల్లో క్యాష్ నిండుకున్న వెంటనే నగదును అందుబాటులో ఉంచేలా బ్యాంకు అధికారులు తగు చర్యలు తీసుకుంటే మాకు ఈ తిప్పలు తప్పేవని వారంతా వాపోతున్నారు.

సువార్తీకులపై గురుతర బాధ్యత

దెందులూరు: ప్రజలకు ఆధ్యాత్మిక సేవలందించే సువార్తీకులపై గురుతర బాధ్యత ఉంటుందని తెలంగాణ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ పల్లె హర్షవర్ధన్, బెతస్థ గాస్పెల్ చర్చి దైవజనులు ఫాస్టర్ పల్లె విశాల్ అన్నారు. మంగళవారం దెందులూరులోని ట్రూలైట్ చర్చిలో దైవజనుల సమావేశం నిర్వహించారు. ట్రూలైట్ చర్చి ఫాస్టర్ ప్రసాద్, పాస్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకుల పునర్నియామకం చేపట్టాలి

దెందులూరు: ఉద్యోగాల నుంచి తొలగించి 40 రోజులు దాటుతున్నా నేటికీ పునర్నియామకం చేయకపోవడంపై దెందులూరు నియోజకవర్గంలో ఆరోగ్య సహాయకులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆరోగ్య సహాయకుల సంఘం నాయకులు నున్నా గురునాథం అన్నారు. హైకోర్టు తీర్పును అనుసరించి తక్షణమే మెరిట్ జాబితాను సిద్ధం చేసి అర్హు లందరికీ న్యాయం చేయాలని వారు కోరారు.



ఉంగుటూరు: లాటరీల ఆటలో పాల్గొన్న మహిళలు



భీమడోలు: గుండుగొలనులో నంబర్స్ ఆటను చూస్తున్న యువతీ యువకులు



గణపవరం: కోడిపందేల శిబిరం వద్ద కోలాహలం

జోరుగా కోడి పందేలు

- బరుల వద్ద యథేచ్ఛగా గుండాట, పేకాట
- ఒక్కో బరిలో రూ.లక్షల్లో చేతులు మారిన ఫైనం



పెదవేగి : తాళ్లగోకవరంలో హోరాహోరీగా కోడిపందేలు

ఉంగుటూరు: సంక్రాంతి పండుగ ముసుగులో సాగిన కోడి పందేలు, జూద క్రీడలు బుధవారం సాయంత్రంతో ముగిసాయి. మూడు రోజుల పాటు కోడి పందేలు కొనసాగాయి. పందేల ముసుగులో బరుల వద్ద పేకాట, గుండాట, పేకాట, గుండాట, కూర పందేలు యథేచ్ఛగా సాగాయి. అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. కోడి పందేలు, జూదాల్లో ఒక్కో బరి వద్ద లక్షలాది రూపాయలు చేతులు మారాయి. బరులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మద్యం విక్రయం, బిర్యానీ, మాంసం పకోడి దుకాణాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు పెద్ద మొత్తంలోనే సొమ్ము చేసుకున్నారు.

ఉంగుటూరు: కోడి పందేలను తిలకించేందుకు అనువుగా ఉంగుటూరు మండలం నారాయణపురం, బాదంపూడిలో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఈసారి పందేల్లో మహిళలు, వేరే గ్రామాల నుంచి వచ్చిన యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం చేబ్రోలు ఎస్సై భగవాన్ మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహించిన బరులవద్దకు తన సిబ్బందితో వెళ్లి పందేలను నిలుపుదల చేయించారు.

గంటకుపైగా పోరాటం.. అంతా ఉత్కంఠత

నారాయపురంలో పెద్ద బరిలో నిర్వహించిన కోడి పందెంలో ఓ విచిత్రమైన ఘటన చోటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం రెండు పుంజులు బరిలోకి వదిలాక అవి నువ్వానేనా అన్న రీతిలో సుమారు గంటపాటు తలపడ్డాయి. ఒక పుంజు కాలికి గాయమైనా పోరాడుతోంది. రెండో పుంజు కూడా పోరాడి అలసిపోయింది. ఎన్నిసార్లు ఆ రెండు పుంజులకు సపర్యలు చేసి పందేనికి వదిలినా కొంత సమయం పోరాడి అలసిపోయి కూలబడి పోతున్నాయి. పందెం కాసిన వారందరూ ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా రెండు పుంజులు బరిలో కూలబడిపోయాయి. కోడి పందెం నిర్వాహక పెద్ద వచ్చి ఎవరి కోడి వారిదేనని తీర్పు చెప్పడంతో ఎవరి డబ్బు వారి దగ్గరే ఉంచేసుకున్నారు.



పెదవేగి : దిబ్బగూడెంలో కోడిపందెం వేస్తున్న దృశ్యం

మూడో రోజూ కొనసాగిన కోడి పందేలు

గణపవరం: గణపవరం మండలంలో బుధవారం కనుమరోజు కోడిపందేలు, జూదాలు యథేచ్ఛగా నిర్వహించారు. గణపవరంలో రెండు, ముగ్గుళ్ల, గోపవరం, చిలకంపాడు, అప్పనపేట, కాశిపాడు, మెయ్యేరు తదితర గ్రామాల్లో కోడిపందేలను భారీగా నిర్వహించారు. పందేల బరుల వద్ద గుండాట, కోతాట తదితర జూదాలు భారీగానే సాగాయి.

కోడి పందేలకు తెర

భీమడోలు: మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అంబర్‌పేట, పోలసానిపల్లిలో కూటమి నాయకులు కనుసన్నల్లో ఏర్పాటు చేసిన భారీ బరుల్లో కోడి పందేలు, జూదాలు జోరుగా సాగాయి. భీమడోలు, గుండుగొలనులో భారీ బరులు వద్ద ఫ్లడ్‌లైటన్లను ఏర్పాటు చేసిన కోడి పందేలు సాగించారు. చిన్నారులు, యువతులు పందేల బరి వద్ద కనిపించారు. పోలీసులు ఆకస్మిక దాడుల చేసి బుధవారం సాయంత్రం నుంచి పందేలను నిలిపివేసారు. కొన్ని చోట్ల బరులను ధ్వంసం చేసారు. మండల వ్యాప్తంగా 30 కేసులను నమోదు చేసినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

ముగిసిన కోడిపందేలు, పేకాట

దెందులూరు: సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కోడిపందేలు, పేకాట మంగళవారం సాయంత్రం ముగిశాయి.బుధవారం సాయంత్రం 5 గంటల వరకూ కోడి పందేలు జరిగాయి. అనంతరం బరుల వద్దకు పోలీసులు రావడంతో జూదరులు, పందేల నిర్వాహకులు అక్కడినుంచి వెనుతిరిగారు.

పోలీసు హెచ్చరికలు బేఖాతర్

పెదవేగి : దెందులూరు నియోజకవర్గవ్యాప్తంగా సంక్రాంతి పునస్కరించుకుని పలు గ్రామాల్లో పోలీసుల హెచ్చరికలను బేఖాతర్ చేసి కోడి పందేలు, జూదాలు సోమవారం నుంచి బుధవారం వరకూ కొనసాగించారు. పెదవేగి మండలంలో కొప్పాక, దిబ్బగూడెం, రామశింగవరం, తాళ్లగోకవరం, బాపిరాజుగూడెం, పెదకడిమి, విజయరాయి, వేగివాడ, దుగ్గిరాల తదితర గ్రామాల్లో కోడి పందేలు, జూదాలు జోరుగా జరిగాయి. బుధవారం సాయంత్రం పందెం బరులను ధ్వంసం చేసామని పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా గురువారం కోడిపందేలు నిర్వహిస్తే, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కోడి పందేల్లో ఫోన్‌పే, గూగుల్ పేకి నగదు

ఉంగుటూరు: నారాయణపురం కోడి పందేలు నిర్వహించే పెద్ద బరిలో ఓవిచిత్రమైన స్టాలు కనిపించింది. అక్కడున్న బ్యానరు గూగుల్ పే, ఫోన్ పే, ఆన్‌లైన్ ద్వారా సొమ్ము పంపించిన వారి చేతికి కరెన్సీ అందజేసే సదుపాయం కల్పించారు. అయితే ఊరికే కాదు సుమా కొంత సొమ్ము తీసుకుని కరెన్సీ అందజేశారు. దీనిని జూదరులు వినియోగించుకోవడం విశేషం.



భీమడోలు: కోడి పందేల బరి వద్ద గుండాట



పెదవేగి : గుండాటను ఆసక్తిగా చూస్తున్న యువత

ఆనందోత్సాహాల నడుమ సంక్రాంతి సంబరాలు



గుండుగొలనులో గ్రూప్ ఫొటోలో మామిళ్లపల్లి వారి కుటుంబ సభ్యులు



అప్పసాని శేషగిరిరావు, కమలాదేవి కుటుంబ సభ్యులు

సకుటుంబ సపరివారంతో వేడుకలకు హాజరు

భీమడోలు: గుండుగొలనులోని మామిళ్లపల్లి వారి ఇంట మూడు రోజులు సంక్రాంతి పండుగ ఘనంగా జరిగింది. ఉమ్మడి రాష్ట్రాల్లోని మామిళ్లపల్లి వంశానికి చెందిన వారంతా కుటుంబ సమేతంగా పాల్గొని సంబరాల్లో పాల్గొన్నారు. వివిధ ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో స్థిరపడిన వారంతా స్వగ్రామం గుండుగొలను చేరుకుని సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకోవడం దశాబ్దాలు సాగుతోంది. గుండుగొలను మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా ఈ సంబరాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఈ విధానాన్ని పాటిస్తున్నామని, అన్ని తరాల వారితో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకంగా ఉందని పేర్కొన్నారు. ఇరిగేషన్ రాష్ట్ర అడిషనల్ కార్యదర్శి మామిళ్ల కాశీకుమార్, వివిధ శాఖలు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన కుటుంబ సభ్యులంతా కనుమ రోజున బుధవారం గ్రూప్ ఫొటోలు దిగారు.

అప్పసాని శేషగిరి దంపతులకు సత్కారం

ఉంగుటూరు: అప్పసాని శేషగిరిరావు, కమలాదేవి కుటుంబ సభ్యులు అభినందనీయులని పలువురు అన్నారు. సంక్రాంతి సందర్భంగా నారాయణపురంలో నాలుగు రోజులుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులంతా సహపంక్తి భోజనాలు చేశారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలు నేటి తరానికి తెలిసేలా వృద్ధాప్యంలోనూ తగ్గని ఉత్సాహంతో స్వగ్రామంలో అప్పసాని శేషగిరిరావు దంపతులు సంక్రాంతి సంబరాలు కుటుంబంలోని అన్ని తరాలు కలిసి నిర్వహించడం అభినందనీయమని పలువురు అన్నారు. గ్రామ మాజీ సర్పంచి అక్కిన నాగమణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, శేషగిరిరావు దంపతులను సత్కరించారు. రవికుమార్, డాక్టర్ ఫణీంద్ర సుబ్బలక్ష్మి శశికళ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కప్పాలమ్మ జాతర



పూరిపాకలో కొలువైన కప్పాలమ్మ తల్లి

గణపవరం: గణపవరం మండల సరిపల్లె గ్రామ ప్రజల ఆరాధ్యదేవత కప్పాలమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ఆలయం నుంచి సరిపల్లె సెంటర్‌లోని అమ్మవారి పూరి గుడిసెకు తీసుకు వచ్చి నెల రోజులుగా పూజలు, సేవలు నిర్వహిస్తున్నారు. సంక్రాతి పండుగ రోజున అమ్మవారికి జాతర నిర్వహించి, మరలా తిరిగి ఆలయానికి తీసుకువెళ్తారు. మంగళవారం ఉదయం అమ్మవారికి గవళ్లగుడుపు సేవ నిర్వహించి, అమ్మ వారిని గ్రామంలో వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఘటాలను ధరించిన ఆసాదులు ఇంటింటికీ వెళ్లి అమ్మవారికి చీర, సారెలు అందుకుంటారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసి, చీర, పండ్లు, చలిమిడి పానకాలు సమర్పించుకుంటారు. అమ్మవారిని గ్రామంలో వైభవంగా ఊరేగించారు. విచిత్ర వేషాలు, శక్తివేషాలు, గంగిరెద్దు విన్యాసాలు, బుట్టబొమ్మలు, బ్యాండు మేళాలు, తీన్‌మార్ వాయిద్యాలతో అమ్మవారిని గ్రామంలో వీధివీధినా ఊరేగించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు క్రొవ్విడి సాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు బుధవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

పశుపోషణ ప్రతి ఒక్కరి బాధ్యత



గణపవరంలో గోపూజ చేస్తున్న భక్తులు

గణపవరం: సంప్రదాయాలకు పెద్దపీట వేసే సంక్రాంతి పర్వదినంలో ప్రతి ఒక్కరూ పశుపోషణకు కంకణ బద్ధులుకావాలని పలువురు అన్నారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా గణపవరం టీటీడీ కల్యాణ మండపంలోని రామాలయం వద్ద గోపూజ ఘనంగా నిర్వహించారు. పశువులను అలంకరించి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. అనంతరం గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత హేండ్‌లూమ్స్ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు మాట్లాడుతూ తెలుగు లోగిళ్లో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పశుపషణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. కనుమ పండుగ అంటేనే పశువుల పండుగ అని కనుమరోజున పశువులను ప్రత్యేకంగా అలంకరించడం, గోపూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని దీనిని భావితరాలకు అందించడం మన బాధ్యత అన్నారు. ప్రధానార్చకులు పవన్‌కుమార్, భద్రాద్రి గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారి రోహిత్‌రాజు, మణికంట, ఇమంది కనకారావు, మాధురి, వేగేశ్న బంగార్రాజు పాల్గొన్నారు.

పదిలో ఉత్తీర్ణతకు.. ‘విజయ కేతనం’

- జెడ్పీ నిధులతో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్
- టీచర్స్ యూనియన్ల నుంచి టెన్త్ సబ్జెక్ట్ కంటెంట్
- గత ప్రభుత్వంలో ప్రారంభం.. ఈ ఏడాదీ కొనసాగింపు



విజయకేతనం పుస్తకాలను చదువుతున్న చానమిల్లి జెడ్పీస్కూల్ విద్యార్థినులు

నిడమర్రు: మార్చి 17 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా జిల్లా విద్యాశాఖ అధికారులు సంకల్పించారు. గతంలో ఉంగుటూరు నియోజకవర్గంలో 50 శాతంపైగా ప్రభుత్వ/ జెడ్పీ పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ఉంగుటూరు నియోజకవర్గం సత్తా చాటేది. గత నాలుగేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన స్కూళ్లలో ఒక్కటీ లేదు. దీంతో పదిలో మంచి ఫలితాలు సాధించేలా ఆయా స్కూల్స్ సిబ్బంది, మండలస్థాయి అధికారులు కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాం నుంచి పదిలో మెరుగైన ఫలితాల సాధనకు 2023 నుంచి జెడ్పీ నిధులతో విజయ కేతనం పేరుతో స్టడీ మెటీరియల్‌ను జెడ్పీ విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది జిల్లా పరిషత్ కొనసాగించింది. దీనిలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ఈ విజయ కేతనం పుస్తకాలను పంపిణీ చేసారు. ఏపీ విద్యాశాఖ ప్రకటించిన నూతన కాలనిర్ణయ పట్టిక ప్రకారం 100 రోజుల పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతుంది. ఈ తరగతుల్లో వెనకబడిన విద్యార్థులకు ఈ విజయ కేతనం స్టడీ మెటీరియల్‌తోపాటు, ఉపాధ్యాయ సంఘాలు యూటీఎఫ్, ఎస్టీయూ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను చదివిస్తున్నారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు ఉంగుటూరు నియోజకవర్గంలో 2,079 మంది ప్రభుత్వ విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

నిపుణులైన సబ్జెక్టు టీచర్లతో కూర్పు

విద్యార్థులకు అందిస్తున్న ఈ విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించారు. అన్ని సబ్జెక్టుల్లో మోడల్ పేపర్లను సిద్ధ చేయడమే కాక వాటికి జవాబులతో సహా విజయకేతనం పేరిట స్టడీ మెటీరియల్‌ను పుస్తకం రూపంలోకి తీసుకువచ్చారు. నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయుల సూచనలతో కూర్పు చేశారు. గతంలో రూపొందించిన స్టడీ మెటీరియల్లో దాదాపు 60 శాతం ప్రశ్నలు పరీక్షా పత్రాల్లో కనిపించేవి. ఈ ఏడాది రూపొందించిన స్టడీ మెటీరియల్ కనీసం 80 శాతం ప్రశ్నలైన ఉండేలా చేయాలనే దిశగా స్టడీ మెటిరియల్ తీర్చిదిద్దారు.

టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల వివరాలు

మండలం	జెడ్పీ స్కూళ్లు	మొత్తం విద్యార్థులు
ఉంగుటూరు	10	638
నిడమర్రు	07	328
గణపవరం	07	510
భీమడోలు	07	603
మొత్తం	31	2,079

విద్యార్థులు పరీక్షల్లో ఎక్కువ స్కోరింగ్ చేయడానికి ఉపయోగపడేలా చేయాలనే దిశగా స్టడీ మెటీరియల్‌ను తీర్చిదిద్దారు. విద్యార్థులు పరీక్షల్లో ఎక్కువ స్కోరింగ్ చేయడానికి ఉపయోగపడేలా ఎనిమిది మార్కుల ప్రశ్నలపూ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయా ప్రశ్నలకు జవాబులు చిన్నగా, విద్యార్థులకు సులభంగా గుర్తుండేలా రూపొందించారు. అంటే ఈ ప్రశ్నలను, జవాబులను చదివితే ఇటు 8 మార్కులతో పాటు అటు బిట్ పేపర్‌లో కూడా స్కోరింగ్ చేసే అవకాశం ఎక్కువగా ఉంది.

వెనుకబడిన విద్యార్థుల్లో పురోగతి



విజయకేతనం స్టడీ మెటీరియల్‌లో అన్ని సబ్జెక్టుల్లోని ప్రధానాంశాలను పొందుపరిచాలని సబ్జెక్టు నిపుణులకు సూచించాం. విద్యార్థి ప్రతి సబ్జెక్టుల్లోనూ ప్రతి రోజు ఒక పెద్ద ప్రశ్న, 2 చిన్న ప్రశ్నలు, 10 బిట్లు చదివించేలా చర్యలు తీసుకున్నాం. ఎస్ఏ–1 పరీక్షల్లోని మార్కులు అధారంగా విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం.

– యర్రంశెట్టి శేషగిరిరావు, హెచ్‌ఎం, చానమిల్లి

ప్రత్యేక తరగతుల్లో తర్ఫీదు



సెలవుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఎంతగానో ఉపయోపడుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం అన్ని సబ్జెక్టులు తర్ఫీదు కొనసాగుతోంది. ప్రతి రోజు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండటం వల్ల సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటున్నాం. విజయ కేతనంలో సబ్జెక్ట్ కంటెంట్ బాగుంది.

– కేపీఎస్‌పీ భవాని, టెన్త్ విద్యార్థి, చానమిల్లి